మోసకారి కాంగ్రెస్‌పై తిరుగుబాటు తప్పదు : బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇంద్రారెడ్డి

ఆత్మకూరు(ఎం), జనవరి 5 : మోసకారి కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యాస ఇంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేడు మాటమార్చి రూ.12వేలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని నేడు ఏ వడ్లకూ బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేశారని అన్నారు. రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు మాత్రమే చేశారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మండల కేంద్రంలోని వీర్ల చెరువుకు గోదావరి జలాలు రావడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సహకారంతో మండలంలోని మోదుగుబావిగూడెం, టి.రేపాక, పారుపల్లి, కొరటికల్, కామునిగూడెం గ్రామాల్లోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు వాగ్దానం చేసిన 6గ్యారెంటీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను, నాయకులను తరిమికొడ్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, నాయకులు బాషబోయిన ఉప్పలయ్య, భిక్షపతి, వెంకటేశ్‌గౌడ్, దశరథగౌడ్, సత్తయ్య, నాగరాజు, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్, సతీశ్, విశాల్ పాల్గొన్నారు.

'రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాజాపేట, జనవరి 5 : రైతుబంధు కింద ఇచ్చే పెట్టుబడి సాయం రైతు భరోసా కింద ఏటా ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఆశలు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు రూ.12వేలు ఇస్తామంటూ రైతులను దగా చేస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు రైతుల ఆశలను అడియాశలు చేసిందని ధ్వజమెత్తారు. రైతు భరోసాను రైతు గుండె కోతగా మార్చారని విమర్శించారు. ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.7,500 ఇస్తామని చెప్పి రూ.6వేలకు కుదించారని, కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది పరాకాష్ట అని ధ్వజమెత్తారు. భూమి కలిగిన రైతులకే కాదు.. కౌలు రైతులకు కూడా రెండు సీజన్లకు కలిపి రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రమాణం చేశారని తెలిపారు. ఆ విషయాన్ని క్యాబినెట్‌లో ప్రస్తావించకుండా కౌలు రైతుల గుండెలపై గుద్దారని వ్యాఖ్యానించారు. వానకాలంలో ఎగ్గొట్టిన రైతు భరోసాను యాసంగితో కలిపి రూ.15వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని, ఇది వంచన ప్రభుత్వమని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, బొంగోని ఉప్పలయ్యగౌడ్, వెంకటేశం, రామ్‌గోపాల్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని మర్చిపోయిన ప్రభుత్వం

- బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు ధనలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు ధనలక్ష్మి

ఆత్మకూరు(ఎం), జనవరి 5 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన 6గ్యారెంటీల్లో మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరిచిపోయిందని బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు బీసు ధనలక్ష్మీచందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైన మహిళలందరికీ నెలకు రూ.2500 ఇస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టినప్పటికీ బస్సుల సంఖ్య పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నూటికి 10మందికి కూడా గ్యాస్ సబ్సిడీ పడుతలేదన్నారు. వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్, కల్యాణ లక్ష్మి పథకం ద్వారా రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయని, శాంతిభద్రతల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే తిరగబడక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ యాస కవిత, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, శశికళ, రమాదేవి, నర్సమ్మ పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఐటీఐ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలి'

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 5 : నిత్యం బైపాస్ రోడ్డు గుండా ప్రయాణించే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని, తక్షణమే పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని అండర్ పాస్ సాధన కమిటీ కన్వీనర్ సిలువేరు ఎల్లయ్య అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో ఆదివారం అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి మండలంతోపాటు వివిధ మండలాల నుంచి వందలాది మంది ప్రయాణికులు, ప్రజలు పలు బైపాస్ రోడ్డు వెంట వచ్చి వెళ్తుంటారని, ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ ఐటీఐ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ అధ్యక్షుడిగా కొమురెల్లి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుబ్బూరు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా చిన్నం సత్యనారాయణతో పాటు పలువురు సభ్యులు ఎన్నికయ్యారు. సమావేశంలో కో కన్వీనర్లు మందడి సిద్ధారెడ్డి, సిలివేరు మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'చేనేత త్రిఫ్ట్‌ను కొనసాగించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నయ్య

మోత్కూరు, జనవరి 5 : చేనేత కార్మికులకు ఉపాధిని కల్పించే చేనేత త్రిఫ్ట్ పథకాన్ని కొనసాగించాలని పద్మశాలీ సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోచం కన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతను సంక్షోభం నుంచి గట్టెక్కించడం కోసం గత ప్రభుత్వం చేనేత త్రిఫ్ట్ పథకాన్ని అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా ఆ పథకం అమలు గురించి పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేత రుణాలను షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. వంగరి రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు పోచం భిక్షపతి, కార్యదర్శి రవీందర్, నాయకులు లక్ష్మణ్, అంబదాస్, సోమయ్య, నర్సింహ, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

తెలంగాణ బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- గురుకుల కళాశాల ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 5 : తెలంగాణ బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్ అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఎస్సీ, బీసీ గురుకుల బాలికల పాఠశాలలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డైట్ చార్జీలు పెంచక ముందు, పెంచిన తర్వాత మెనూలో వచ్చిన మార్పులు, నాణ్యత పాటిస్తున్నారా.. లేదా? శుభ్రత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య సహాయం వారి ఆరోగ్య వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించి బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు. నెలలో ఒకసారి హాస్టళ్లలో పర్యటించాలని క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు గంగాధర్, వీరారెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెహమాన్ చిస్తీ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, తాసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

చౌటుప్పల్‌లో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

రామన్నపేట : నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీ కార్మికులు

అర్ధనగ్నంగా హమాలీ కార్మికుల నిరసన

భువనగిరి అర్బన్, జనవరి 5 : పెంచిన కూలి రేట్ల జీఓను విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని గోడౌన్ వద్ద సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ హమాలీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 5రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీఓ విడుదల చేసే వరకు సమ్మె కొనసాగుతుందని, సోమవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్ బాబు, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ భువనగిరి అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ముదిగొండ బస్వయ్య, పిన్నం జగన్, స్వామి, సత్యనారాయణ, గణేశ్, చంద్రయ్య, పాండరి, కిష్టయ్య, పరశురాములు, రాజు, స్వామి, నర్సింహ, నరేశ్, స్వీపర్లు శాంతమ్మ, అంజమ్మ, శారద, శోభ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో గోదాము ఎదుట హమాలీ కార్మికులు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శంకరయ్య, నాయకులు ఎస్ఏ రహమాన్, యాదయ్య, సైదులు, కె.శంకరయ్య, ఈశ్వర్, వెంకటయ్య, లింగస్వామి, శ్రీకాంత్, సంజీవ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ గోదాం వద్ద హమాలీ కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, సహాయ కార్యదర్శి ఎర్ర రమేశ్, నాయకులు సత్తయ్య, సమ్మయ్య, నర్సింహ, శంకరయ్య, స్వామి, అంజయ్య, రవి, ఉపేందర్, అచ్చాలు, అనిల్, శ్రీను పాల్గొన్నారు.

మోత్కూరు : సివిల్ సప్లయ్ గోడౌన్ హమాలీలు అర్ధనగ్నంగా కూర్చొని ఆందోళన చేశారు. ఆందోళనకు సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడి మద్దతు తెలిపి మాట్లాడారు. సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, హమాలీలు రవి, నర్సయ్య, యాదగిరి, మారయ్య, రమేశ్, జీడయ్య, కృష్ణ, మల్లేశ్, చంద్రమౌళి, మల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఐదుగురికి గాయాలు
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన

వెంకటరమణ (ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, జనవరి 5 : దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి పట్టణ పరిధిలోని పగిడిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నెహ్రూనగర్‌కు చెందిన లోకాన్ వెంకటరమణ (50) కుటుంబ సభ్యులతో కలిసి కారులో యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అనంతారం గ్రామ సమీపంలోని సర్వీస్ రోడ్డులో భోజనాలు చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా పగిడిపల్లి గ్రామ పరిధిలో హైవే ఎక్కుతుండగా భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బెంజ్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరమణ (50) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య పుష్పలత, కూతురు అశ్రిత, అత్త కందుల అంజమ్మ, బంధువులు ప్రభావతి, భువనగిరి శ్రీనివాస్‌రావుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి బంధువు శ్రీనివాస్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు.

4కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకులు అరెస్టు

రామన్నపేట, జనవరి 5 : ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రామన్నపేట పట్టణ కేంద్రంలో పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఇద్దరు యువకులు బైక్‌పై గంజాయిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఐ పి.మల్లయ్య తన సిబ్బందితో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న వారిని ఆపి తనిఖీ చేయగా.. నాలుగు కిలోల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపడుతున్నారు.

గోవుల పట్టివేత

చౌటుప్పల్, జనవరి 5 : కబేళాకు తరలిస్తున్న గోవులను పోలీసులు ఆదివారం పంతంగి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా తుని నుంచి 12గోవులను రెండు డీసీఎంలలో హైదరాబాద్‌లోని బహదూర్‌పూరాకు తరలిస్తున్నారు. పోలీసుల తనిఖీలో భాగంగా వాహనాన్ని పట్టుకొని గోవులను గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అదేవిధంగా సరైన జాగ్రత్తలు పాటించకుండా తరలిస్తున్న నాలుగు పాడి పశువులను పట్టణంలోని తంగడపల్లి రోడ్డు వద్ద ఆదివారం పట్టుకున్నారు. ఏపీలోని శ్రీకాకుళం నుంచి ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి మినీ డీసీఎంలో పశువులను తరలిస్తున్నారు. అయితే.. తరలించాల్సిన వాటికన్నా అధికంగా ఎలాంటి జాగ్రత్తలు లేకుండా తీసుకెళ్లడంతో పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వాహనం డ్రైవర్, రైతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

క్రీడా మైదానం పరిశీలన

ఆలేరులో క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ సుశీల

ఆలేరు టౌన్, జనవరి 5 : సాయుధ రైతాంగ పోరాటయోధులు ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి దంపతుల జ్ఞాపకార్థం సోమవారం నిర్వహించే క్రీడా పోటీల కోసం ఆలేరులోని క్రీడా మైదానాన్ని ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీల ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అథ్లెటిక్స్ విభాగంలో బాలబాలికలకు క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల, ఉపాధ్యాయులు పూల నాగయ్య, గడసంతల మధుసూదన్, మాదాల జోసెఫ్, కె.దశరథరెడ్డి, మహేశ్, కృష్ణ, చంద్రమౌళి, చంద్రకుమార్, సందీప్, శివాజీ, రామాంజీ పాల్గొన్నారు.

రాజన్నగూడెం ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం

ఆడబిడ్డల సమ్మేళనంలో పాల్గొన్న రాజన్నగూడెం మహిళలు

మోత్కూరు, జనవరి 5 : మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడేనికి చెందిన ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో ఆ ఊరు ఆడబిడ్డలందరూ కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆడిపాడి ఉల్లాసంగా గడిపారు. వివిధ పోటీలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, ఉమాదేవి, రజిని, ఇందిర, కరుణ, మంగమ్మ, ఆండాలు, సుమతమ్మ, జయమ్మ, రామనర్సమ్మ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

జీవిత సాఫల్యం కోసమే సైకిల్ యాత్ర : మంగళ్ సాహు

సైకిల్ యాత్ర చేస్తున్న మంగళ్ సాహు

ఆలేరు టౌన్, జనవరి 5 : రామేశ్వరం, కన్యాకుమారిని సందర్శించి జీవితాన్ని సాఫల్యం చేసుకోవడం కోసమే సైకిల్ యాత్ర చేపట్టానని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దుర్గా భిలాయి ప్రాంతానికి చెందిన మంగళ్ సాహు అన్నారు. యాత్రలో భాగంగా ఆదివారం ఆలేరు బైపాస్ సమీపంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జీవితంలో ఒక్కసారి అయినా రామేశ్వరం, కన్యాకుమారి ఆలయాలను సందర్శించి జన్మను పునీతం చేసుకోవాలనే ఉద్దేశంతో యాత్రను కొనసాగిస్తున్నానని తెలిపారు.

బసవలింగేశ్వరస్వామి కాలనీ నూతన కమిటీ

భూదాన్ పోచంపల్లి, జనవరి 5 : పట్టణంలోని బసవ లింగేశ్వరస్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము లక్ష్మణ్, గౌరవాధ్యక్షులుగా కర్నాటి పురుషోత్తం, పోతగల దానయ్య, మెరుగు యతీనందం, ఉపాధ్యక్షులుగా గోదాసు నరసింహ, వనం రామదాసు, ప్రధాన కార్యదర్శిగా వేముల ఎలేందర్, కార్యదర్శిగా గుండు సత్యనారాయణ, కోశాధికారిగా చేరాల ప్రేమ్ కుమార్, గౌరవ సలహాదారులుగా గడ్డం శ్రీను, శెట్టి శ్రీనివాస్, వలందాసు లక్ష్మీనారాయణ, సభ్యులుగా జినుకల స్వరూప, వల్లందాస్ రమేశ్, బొమ్మ వెంకటేశ్, రచ్చ బాలరాజు, చేరాల ఈరమ్మ ఎన్నికయ్యారు.

మున్నూరు కాపు సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

భువనగిరి అర్బన్, జనవరి 5 : పట్టణంలోని సీతారామ భక్తాంజనేయస్వామి దేవాలయంలో మున్నూరు కాపు సంఘం పట్టణ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాశం భాస్కర్, ఉపాధ్యక్షులుగా పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పట్నం శ్రీనివాస్, నువ్వుల సత్యనారాయణ, బుర్ర రాకేశ్, తాడెం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పోకల రవీందర్, కార్యదర్శులుగా బెల్లంకొండ ఉపేందర్, పోకల ఎట్టయ్య, కోశాధికారిగా చింతకింది కృష్ణమూర్తితోపాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఎల్ఓసీ అందజేత

వలిగొండ, జనవరి 5 : మండలంలోని దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దేవరపల్లి ధనమ్మ అనారోగ్యంతో బాధపడుతుంది. చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ధనమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దేవరపల్లి భూపాల్‌రెడ్డి, అప్పిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండాలి

- ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

బీబీనగర్, జనవరి 5 : విద్యార్థులు చదువుతోపాటు సమాజంపై స్పృహ కలిగి తమ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కిడ్స్ కింగ్‌డమ్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పాఠశాల గ్రేట్ అల్యూమినిరీ యూనియన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆరోగ్య సమ్మేళనాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో నేచర్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ కేవై పద్మ, డీఆర్డీఓ రిటైర్డ్ సైంటిస్ట్ రాజేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చికాగో జయసింహ, కె.హనుమంతరెడ్డి, డాక్టర్ పలని గుప్తారెడ్డి, కె.రమేశ్, రిటైర్డ్ సైంటిస్ట్ రాజేందర్‌రెడ్డి, టీపీటీఈ మాజీ అధ్యక్షుడు రఘునందన్, పాఠశాల కరస్పాండెంట్ కేవీ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు అందజేస్తాం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జనవరి 5 : నియోజకవర్గంలో అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రేవణపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. బసవ శివలింగేశ్వర కాలనీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏండ్ల తరబడిగా ఉంటున్న ఇండ్లకు నంబర్లు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు తడక వెంకటేశ్, నర్సింహారెడ్డి, రమేశ్, మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు లవకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతోనే ప్రశాంతత

పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, గరికపాటి నరసింహారావు

భూదాన్ పోచంపల్లి, జనవరి 5 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాండురంగస్వామి భజన మండలి స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల భజన సంకీర్తన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వీరభద్ర భజన మండలి (రామచంద్రాపురం – వనపర్తి) ప్రథమ బహుమతి, వీర ప్రతాప మారుతీ భజన మండలి (యాదగిరిగుట్ట) ద్వితీయ, శ్రీవేంకటేశ్వర భజన మండలి (వనస్థలిపురం) తృతీయ బహుమతి అందుకున్నారు. అనంతరం పాండురంగ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో రూపొందించిన స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికను అవధాని గరికపాటి నరసింహారావుతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గరికపాటి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు అలవర్చుకోవాలన్నారు. లోక క్షేమం కోసం విరివిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని, కక్షలు, హింసలు విడనాడి ఆత్మీయతను పంచాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, భజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల నరసింహ, పుప్పాల నాగేశ్వర్, ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్ టెస్ట్‌లో కూరెళ్ల విద్యార్థికి ద్వితీయ స్థానం

ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

ఆత్మకూరు(ఎం), జనవరి 5 : సోషల్ ఫోరం ఆధ్వర్యంలో భువనగిరిలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని కూరెళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థి గడ్డం సోను ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థికి డీఈఓ సత్యనారాయణ ప్రశంసా పత్రాన్ని అందజేయగా.. పాఠశాల హెచ్ఎం దామోదర్, సోషల్ టీచర్ సైదులు అభినందించారు.

వ్యాయామ కళాశాలలో అలుమ్ని సెలబ్రేషన్స్

అధ్యాపకులతో విద్యార్థులు

చౌటుప్పల్, జనవరి 5 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ముస్కు మధుసూదన్‌రెడ్డి వ్యాయామ కళాశాలలో ఆదివారం అలుమ్ని సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ ముస్కు మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్ సాహో, అధ్యాపకులు సత్యనారాయణరాజు, పి.శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, రాజేందర్, వసంత, ప్రసాద్ పాల్గొన్నారు.

లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలి

- లింగ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకటాల సోమేశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న సోమేశ్వర్

రామన్నపేట, జనవరి 5 : వీరశైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలని లింగ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకటాల సోమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరశైవ లింగ బలిజలను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రత్యేకమైన సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జుడుగుల అడివప్ప, పురాణమఠం మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు మోకాళ్ల వీరేశ్, అమరిశెట్టి భద్రయ్య, రామ్ శివకుమార్, సంగప్ప, బాలకృష్ణ, కొండయ్య, రమేశ్, మనోజ్ పాల్గొన్నారు.